# దీనికేమంటారు?

శ్రీ అలంపురం రాజు, బి. ఏ.

ఏలూరు బస్సువచ్చి గభాలున వంతెనమీద ఆగింది. వంతెన చివర కూర్చున్న మణేగారు దద్దయ్య భయంతో కాళ్ళు పైకితీసికున్నాడు. బస్సుకు వెనుకసీటులో కూర్చున్న నారీమణుల సౌందర్య సౌరభాన్ని ఆఘ్రాణించడానికి ప్రెసిడెంటు నడింపల్లి కూర్చున్నచోటినుండి లేచాడు. సహజతీవితో, కూర్చున్నచోటునుండి కదలనివాడు మునసబుశివాజీ.

బస్సులోంచి నెత్తురు కారుతోన్నముక్కుతో, ఆ కారిన నెత్తురుతో తడసిన షర్టుతో డ్రయివరు గభాలున క్రిందికిదిగాడు. మునసబునుచూచి "అయ్యా! బస్సువస్తోంటే ప్రయాణీకుడిలాగ బస్సునాపి అమాంతంగా నన్నొకడు సీటునుండి క్రిందికిలాగి ముక్కుమీద గుద్దాడు. అతనిది మీ గ్రామమేనట. పైగా దిక్కున్నచోట చెప్పుకోమన్నాడు" అని కన్నీటిని జేబురుమాలుతో తుడుచుకుంటూ అన్నాడు. ఇంతలో వెనుకనుండి సైకిలుమీద శాండో సత్యం వచ్చాడు. అతను "మునసబుగారూ, ఇతన్ని కొట్టినది నేను, మనగ్రామంలో లలితను మీరెఱుగుదురుగదా, ఆమెను రోడ్డుమీద ఒంటరిగాచూచి వీడేదో నిన్న ప్రేలాడట. దానికిది ప్రాయశ్చిత్తం. ఆమె హృదయం నిష్కళంకమైంది. ఆమె ప్రవర్తనాన్నిచూచి మనగ్రామం గర్వింపదగ్గది. ఈతనిని నేను కొట్టినట్లు రిపోర్టు చేయమంటాడా,—ఆమెకు మానహాని చేసినట్లు ఈతని భరతం నేను పడతాను" అన్నాడు. "తగవు తీరేపోయింది. ఇకనీవు జాగ్రత్తగా బస్సునడుపుకో" అన్నాడు మునసబు. బస్సు సాగిపోయింది. "సౌందర్యసంపత్తు ననుభవించడానికి యువకులు మనగ్రామంలో లేనట్లు వాడు ప్రవర్తించినందుకు తగినశాస్తి అయింద"న్నాడు ప్రెసిడెంటు.

★

లలిత బాలవితంతువు. వంతెన ప్రక్కనున్న మిల్లులో నెలకు 8 రూపాయలజీతంమీద పనిచేస్తుంది. పని పూర్తికాగానే మిల్లులోని దుమ్ముబట్టలను విడిచి, ఉదయం తాను కట్టుకువచ్చిన తెల్లని సైనురవికె సైనుచీరాకట్టుకుని తలవంచుకొని వంతెనమీదుగా యింటికి జేరుకుంటుంది. హృదయంలోని అమాయకత్వం ఆమె ముఖంమీద ప్రస్ఫుటంగా కానవస్తుంది. సంఘం తన్ను వంచించినదన్న వేదన ఆమె కండ్లలో నిత్యమూ గోచరిస్తుంది. శరీరంలోని యౌవ్వనం ఉబ్బితబ్బిబ్బై చెక్కిళ్ళలోంచి మొటిమెలుగా పొంగి పొరలిపోతూ ఉంటుంది.

ఆమె బీదరికం, వైధవ్యం ఆధారంగా తీసికొని యువకులామెను వంచింపజూచారు. కాని ఆమె నిశ్చలచిత్తాన్నిచూచి, వారు హతాశులయ్యారు. శాండో సత్యం ఆమెను వాంఛించినవాడే. ప్రెసిడెంటి నడింపల్లి చూపులతో ఆమెకు చక్కలిగింతలు పెట్టినవాడే. మునశబు శివాజీ ఆమెనుజూచి తనకోరమీసం సవరించినవాడే. కాని ఆమె హృదయం చలింపలేదు. పురుషుడు చేరువకురాగానే భయవినయాలతో ఆమె తొలగిపోతుంది. మనుష్యుని కంటబడ్డ సెలపాములాగ, తొట్రుపాటుతో, తడబడే అడుగులతో, అనాస్వాదిత యౌవనసౌష్ఠవంతో శ్వేతవస్త్రాలతో ఆమె వేడుతోంటే ఆ గ్రామవాసులామెనుజూచి విషాదపడేవారు. అంచేతనే ఆ బస్సుడ్రైవరుకు శాస్తి జరిగింది.

★

తెనాలి వెంకట్రామయ్య పెదవులు పురాణ భాండారపు తలుపులు. అతను పురాణగాథలు గ్రామ చావడిలో చెబుతూంటే ఆబాలగోపాలం ఆకర్షింపబడే వారు. అతన్ని శిష్యరాండ్రకు జీవాత్మ పరమాత్మ సన్నియోగం ప్రత్యక్షంగా చూపిస్తున్నాడని గుసగుసలు బయలుదేరాయి. అంచేత అతను గ్రామం విడిచిపోయాడు.

అతనికి ప్రియశిష్యుడు సుబ్బారావు, సుబ్బారావు వేదాంతి అని నలుగురూ అనుకోవడం మొదలెట్టారు. వెంకట్రామయ్యతర్వాత సుబ్బారావు వెంకట్రామయ్య అంతటివాడని లలితమనస్సుకుతోచింది. వేదాంతమార్గాలాలోచించే ఈసుబ్బారావు మిల్లులో పనిచేస్తే, తననిస్సారజీవితం సురక్షితంగా గడచిపోతుందని వూహించి సుబ్బారావు మిల్లులో ఆమెచేరింది.

★

లలితకు ఒకకోడిపిల్ల ఉంది. పెరటిలో కోకిల కూస్తూంటే ఆ పిల్లవినడానికి వెళ్ళింది. పెరటి చివర కోకిల కనపడలేదుగాని, ఒక బొంతకాకి కనబడింది. ఆకాకి రివ్వునవచ్చి కోడిపిల్లలను కరచింది. పొట్టమీద పుండుపడింది. ఇంతలో లలితవచ్చి కోడిపిల్లనుతీసి పుండు నీటితో కడగబోయింది. కడుగుతూంటే ఆకోడి పిల్ల చేతినుండి జారి క్రిందకుపడిపోయింది. 'అయ్యో' అని లలిత కేకవేసింది. ఆ కేకతో ఆమెకు మెలకువ వచ్చింది.—ఇది సుబ్బారావు మిల్లులో ప్రవేశించిననాటిరాత్రి లలితగనిన కల.

★

చల్లగాలికి వచ్చి వంతెనమీద ప్రెసిడెంటు, శివాజీలు కూర్చొనియున్నారు. వడ్డీలెక్కలు చూచుకొంటూ ఆనాడు మణేగారు రాలేదు. రాత్రి 8 గంటలు కావస్తోంది. ప్రెసిడెంటు వంతెన కెదురుగానున్న వెంకమాంబకూతురు విలాసచేష్టలు చూస్తున్నాడు. చీకటిలోగాలి కెగిరిపోయిన "చిత్రగుప్త"ను శివాజీ బ్యాటరీ లైటుతో వెతుకుతున్నాడు. ఆ లైటులో మిల్లులోనుండి ఎవరో వస్తున్నట్టు అతను చూచాడు. ఆ వ్యక్తి యింకెవరు? లలిత! అమెపై లైటు ప్రసరింపజేశాడు. ఆమె చిత్తము రిత్తభయాలచే తత్తరిల్లుచున్నట్టు అతను కనిపెట్టాడు. ఆమె ముంగురులు అసాధారణ రీతిని చెదరియుండటం అతను చూచాడు. ఆమెజీవితోద్యాన వనమందలి పుష్పాలను సుబ్బారావనుభవిస్తున్నాడని వారిరువురు రూఢిచేసుకున్నారు.

★

దైవలీలలు విమర్శించే కొలదీ విచిత్రాలై తోస్తాయి. ప్రచండభానుని తీక్ష్ణకిరణాలలో ఎండబెట్టినశర్కర మరుక్షణంలో వర్షపాతంచే కరగి కొట్టుకుపోతోంది. శీతల వర్షోదకంచే శరీరతాపం బాపుకుందామని వానలో నిలచిన జీవిపై పిడుగుపడి ప్రాణాల నపహరిస్తోంది; 'ఈమె నడవడికను జూచిమనగ్రామం గర్వింపదగ్గది'- అని పొగడబడ్డలలిత,-ఈనాడు ఒకసామాన్యుని, కాదు, అధమునిచేత వచింపబడింది. శరీరపటిమ, శౌర్యము నారాధించినచో, ఈమె శాండో సత్యాన్నేల వాంఛింపలేదు? నవయౌవ్వనము, రసికత నారాధించినచో ప్రెసిడెంటుకై యేల వాపోవలేదు? అధికారము, తీవి సౌందర్యము నారాధించినచో శివాజీకై యేల యాశించలేదు? దేశభక్తి, ధనము నారాధించినచో మణేగారు వంటివాని చెంగజేర నేల యుత్సహింపలేదు? ఈ గుణములలో నొకటేని, కొంచమేని, సుబ్బారావుదగ్గర లేవే! రెండెకరాల పొలము తనపేర రిజిష్టరుచేసి నప్పుడే వుపపత్నిగా యంగీకరింపుమని యడిగినయువకుని కోర్కె యీామె నిరాకరించింది. వితంతు శరణాలయంలోకి వెళ్ళమని యిచ్చినవ సలహా పెడచెవినిబెట్టింది.

ఆనాడు సుబ్బారావు కౌగిళ్ళలో ఆమె అనుభవించినది ప్రేమసారస్యమా? కాదు. నిజపత్ని వలన అరడజను పిల్లలుగని, వేదాంతికాకమునుపు అంతకంటె యెక్కువ యిల్లాండ్ర జెఱచిన వాని యింద్రి

యోద్వేగం పశువాంఛంగాని, పవిత్రప్రేమ యెటు లౌతుంది? ఈ సంఘటన ప్రథమ సందర్శనా జనిత ప్రేమపరిణామమా? కాదు. మరేమి? విధిప్రేరితం. ప్రేమగుడ్డిది. స్త్రీహృదయాంతరాళప్రేమ లతవంటిది. ప్రాకడానికి ఆధారం ఒక కంచ ఉండాలి. ఆ కంచంలో తన జీవననాళాలను గ్రుచ్చి కృశింపజేసే కంటకాలున్నా ప్రాకడం మానదు. మిల్లులో ప్రవేశించేటప్పుడు వినాశ గర్త ఆమె అడుగుల క్రింద వివృతద్వారమై యున్నట్లు లలిత చూడలేదు.

★

లలితచేసిన యపకృతిని ప్రకృతి క్షమించలేదు. ఆమె యిప్పుడు మంచంమీద లేవలేని స్థితిలోవుంది. భ్రూణహత్యాదోషమామెను భూతమై నాలుగురోజుల్ల నుండి వేదిస్తోంది. పిండపతనమాదిగా గర్భకోశంలో మహత్తర వేదన బయలు దేరింది.

నారాయుడుకొట్టులో ఏవేవో తెచ్చి మాత్రలు కట్టియిచ్చారు. కాని బాధతగ్గలేదు. నడివీధిలో వైద్యశాస్త్రజ్ఞుని మందులు కొన్ని ప్రజలకు విషమించ డంచే ఒకప్పుడు ఏలూరుకాలువలో పారబోయడంచేత ఆయనవద్దకు మందుకు వెళ్ళడానికి సంశయించారు. ఇక మిగిలింది బడివద్ద వైద్యుడు. ఆయనవద్ద ఉన్న 'ఎర్రమందు' 'నల్లమందులు' సంజీవి మూలికలచే చేసిన చూర్ణాలు. దురదృష్టవశాత్తు ఈ మందుల నుప యోగింపక, పాశ్చాత్యరీతి ననుకరించాలని లలితకు 'డూషింగ్' చేయసమకట్టాడు. ఒక సంతకంచేసినపాళీ మరొక సంతకానికి పనికిరాని హస్తలాఘవముగల ఈ వైద్యుడు 'డూషింగ్' చేయడంలో మితిమీరి నీటిని గర్భకోశంలోకి ఎక్కించేశాడు. లలితకు వాయు ప్రకోపం ఎక్కువైపోయింది. ఒక్కొక్కప్రాణం శరీ రాన్ని విడిచి వెండ్రుకలలో ప్రవేశిస్తున్నట్టు ఆమెకు గోచరించింది.

ఆమె మనస్సు ఒక్కసారిగా సుబ్బారావుమీదికి పోయింది. తన్ని దురవస్థకు తెచ్చినవానిపై కినుక జెంద డానికి మారుగా అంత్యసందర్శన భాగ్య మామె యపే క్షించింది. కాని యాతడొక గోముఖ వ్యాఘ్రం. అనాథలకన్నీరు. వానికి పన్నీరు. వింతువుల విచారం వానికి సంగీతం, ఆ కృతఘ్నుని హృదయం లలితప్రేమ వర్షోదకాన్ని దిగమింగిన ఇసుకయెడారి. ఆమె వాంఛిం చినపుడైన, చూడనైన రాలేదు.

ఇంతలో నిర్మలాకాశాన్ని కారుమబ్బులు క్రమ్ము కొని దినమణిని గప్పివుచ్చినై. జగత్తు కళావిహీనమై వెలవెలబోతోంది. పెనుభూతంలా వొకసుడిగాలి లలిత కుటీరాన్నావహించి ఆమె మల్లిపందిటిలో పురుగు పట్టిన మల్లిమొగ్గ నొకదాన్ని గగనవీథులకు ఎత్తు కొనిపోయింది. అంతేకాదు. దానితోపాటు లలిత ప్రాణాలనుకూడా ఎత్తుకుపోయింది.

